క్లుప్తంగా

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



గుడివాడరూరల్: మినుము పైరులో వచ్చే తెగుళ్లపై రైతులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి సూచించారు. మండలంలోని చౌటపల్లి రైతుసేవా కేంద్రంలో ఏఓ అనంతలక్ష్మి అధ్యక్షతన జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. ప్రస్తుతం మినుము సాగులో ఎల్లో మోసాయిస్ తెగులు, తలమాడు తెగులు రాకుండా ఉండాలంటే ముందుగానే రైతులు పొలం గట్లపై జొన్న, మొక్కజొన్న వంటివి వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పొలాల్లో పసుపు, బులుగు రంగు జిగురు పళ్లాలను ఎకరానికి ఎనిమిది నుంచి 10 వరకు పెట్టుకోవడం వల్ల తెగుళ్లను వ్యాపింపజేసే తెల్లదోమలు, తామర పురుగులను అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెలగలేటి రమ్య, పంచాయతీ కార్యదర్శి పి.హరికృష్ణ, వీఏఏ కె.దిలీప్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



గుడ్లవల్లేరు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ చేసుకోవచ్చునని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ అన్నారు. జగనన్న కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని అంబటి మధుమోహనకృష్ణ ఆర్థిక సాయంతో చేపట్టారు. మాజీ సర్పంచ్ చాపరాల బాలాజీ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పరంధామయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల హక్కుల దినోత్సవం



గుడివాడరూరల్: స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల్లో మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ మాట్లాడారు. వినియోగదారుల హక్కులు, నష్ట పరిహారం, ఫిర్యాదులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఏ విధంగా ఇవ్వాలి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కేప్రసాద్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో నగర సంకీర్తన



మండవల్లి: మండవల్లిలోని శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి భిక్ష స్వీకరించారు. బాబా మందిరం నుంచి ఆంజనేయస్వామి ప్రతిమ వరకు నగర సంకీర్తన నిర్వహించారు. గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో వ్యక్తికి రిమాండ్

కైకలూరు: క్రికెట్ టోర్నమెంటు నిర్వాహకులతో జరిగిన ఘర్షణ కేసులో ఓ వ్యక్తికి 14 రోజులు రిమాండ్ విధించారని కైకలూరు టౌన్ ఎస్‌ఐ డి.వెంకట్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న వైవీఎన్నార్ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన టోర్నమెంటులో జాన్‌పేటకు చెందిన కూనవరపు సతీష్ మరో ముగ్గురు కలిసి నిర్వాహకులతో గొడవకు దిగారు. ఈ ఘర్షణలో గడిదేశి విజయ్‌కుమార్ అనే వ్యక్తి గాయాలతో ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఆస్పత్రి డాక్టర్ల ఫిర్యాదు మేరకు గాయపడిన విజయ్‌కుమార్‌తో స్టేట్‌మెంట్ తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సతీష్‌ను మచిలీపట్నంలో అదుపులోకి తీసుకుని కైకలూరు మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని పేర్కొన్నారు. సతీష్‌ను మచిలీపట్నం జైలుకు తరలించినట్లు తెలిపారు.

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు గ్రామాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. బుధవారం క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించేందుకు ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్టార్స్ ఏర్పాటు చేసి, వాటిలో విద్యుత్ బల్బులను అమర్చారు. రంగుల బెలూన్లను కట్టి అందంగా రూపొందించారు.

పామర్రు: పామర్రులోని ఆర్‌సీఎం చర్చి, యేసన్న ప్రార్థనామందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని పెదమద్దాలి, కురుమద్దాలి, కనుమూరు, జమీగొల్వేపల్లి, అడ్డాడ, ఐనంపూడి తదితర గ్రామాల్లోని చర్చిలను క్రిస్మస్ పండుగ సందర్భంగా విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు.

దేవుడి మీద నమ్మకంతో ప్రార్థనలు

గుడివాడరూరల్: పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో దేవుడిమీద నమ్మకం ఉంచి ప్రార్థనలు చేయడంతో పాటు వ్యక్తిగతంగా కూడా ఉద్యోగాలు సాధించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆలియాబేగం, అధ్యాపకులు, ఏఓ బాలాజీ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జీవన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



పెదమద్దాలిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



క్రిస్మస్‌కు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన పెదమద్దాలిలోని చర్చి

సెయింట్ పాల్ చర్చిలో..

పెదమద్దాలి(పామర్రు): స్థానిక సెయింట్ పాల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చిన్నారుల ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సమ్మంగి సత్యరూతు, ప్రసాద్, నవ్య, గ్రేసమస్య, నాంచారయ్య, కృపమ్మ, షారోన్ పాల్గొన్నారు.



గుడివాడ ఆదిత్య డిగ్రీ కళాశాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు

దుస్తుల పంపిణీ



వణుదుర్రులో దుస్తులు పంపిణీ చేస్తున్న దాత బైరాగి

ముదినేపల్లి రూరల్: వణుదుర్రు ప్రార్థన మందిరం వద్ద పేదలకు దాత దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఈదా బైరాగి, బాయమ్మ దంపతులు తొమ్మిదేళ్లుగా క్రిస్మస్ సందర్భంగా గ్రామంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లేళ్ల ఆంజనేయులు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలోని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఓ ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులకు మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఏసుక్రీస్తు బోధనలు, శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనాన్ని ఎప్పటికప్పుడు అనుసరించాలని ఎమ్మెల్యే కోరారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గుడివాడరూరల్: పట్టణంలో చెత్త తొలగింపు పనుల్లో శానిటరీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని గౌరీశంకరపురం, బస్టాండ్ సెంటర్, ఏలూరురోడ్, బంటుమిల్లి రోడ్, పెద ఎరుకపాడు, బేతవోలు తదితర ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అదే విధంగా 22వ వార్డుకు సంబంధించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావుతో కలసి ఆస్తిపన్ను, నీటి పన్ను బకాయిల వసూళ్ల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



మెరకగూడెం సదస్సులో ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, పక్కన తహసీల్దార్



పెదముత్తేవిలో మాట్లాడుతున్న డీఆర్ఓ చంద్రశేఖర్‌రావు



పామర్రులో సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ రవికాంత్

ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

గుడివాడరూరల్: గుడివాడ డివిజన్‌లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు, ప్రజలు నుంచి వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రహ్మణ్యం అధికారులను ఆదేశించారు. మండలంలోని మెరకగూడెం గ్రామంలో మంగళవారం తహసీల్దార్ రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆర్డీఓ మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వో సుబ్బారావు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని కృష్ణా జిల్లా రెవెన్యూ అధికారి కెచంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పెదముత్తేవి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ సీలింగ్ కేసులకు సంబంధించిన అర్జీల పరిష్కారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, నోడల్ అధికారి విజయవర్ధన్‌రావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక సచివాలయం–1 వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 13 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయని తెలిపారు. వీటిలో మొత్తం 55 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని, ఇందులో 10 అర్జీలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో సర్వే డీటీ గంగాధర్, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: రైతుల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని పేరూరు, మాధవరంలో రెవెన్యూ గ్రామ సభలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభానీ మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి వివరాలు, రికార్డుల్లో సక్రమంగా లేనందువల్ల అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వీటిని సవరించి సమస్యలు లేకుండా చేసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.



మూడుతాళ్లపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని, భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కే గోపాల్ అన్నారు. మండలంలోని మూడుతాళ్లపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సదస్సులో ఏడు అర్జీలు అందాయన్నారు. ఆర్ఐ శ్రావణి, వీఆర్ఓ వీర్రాజు, ముళ్లపూడి సత్తిబాబు, సర్పంచ్ ముత్యాల రాజసులోచన తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరమ్మ ఆరాధనోత్సవం

గుడివాడరూరల్: కాలజ్ఞాన ప్రబోధకుడు వీరబ్రహ్మేంద్రస్వామివారి బాటలోనే నడుస్తూ స్వామి మనుమరాలు ఈశ్వరమ్మ మానవజాతి చైతన్యానికి విశేష కృషి చేశారని పట్టణ విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు వసుధ బసవేశ్వరరావు అన్నారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం జగన్మాత, జనని ఈశ్వరమ్మ 235వ ఆరాధన ఉత్సవాన్ని పామర్తి రాజారావు దంపతులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వసుధ మాట్లాడుతూ ఈశ్వరమ్మ స్వామి ప్రభావంతో ఆత్మజ్ఞానాన్ని పొంది, తత్వ బోధనలు చేసి మానవాళికి జ్ఞానం ప్రసాదించారన్నారు. బ్రహ్మంగారి తరహాలోనే కాలజ్ఞానాన్ని సైతం బోధించి చివరకు జీవ సమాధి పొందారన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు చింతలూరి సత్యనారాయణ, దేవస్థాన ప్రతినిధులు పామర్తి రాజారావు, అమృతలూరి పిచ్చేశ్వరరావు, యలమర్తి కోటేశ్వరరావు, గాయకుడు శనగపాటి నాగేశ్వరరావు, గోపి, సూరిబాబు, గాయని చోడవరపు రూప పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘ నేతలు

‘పోరుబాట’ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పామర్రు: పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27వ తేదీన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాలతో పామర్రులో నిరసన కార్యక్రమం జరుగుతుందని నాయకులు మంగళవారం తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెరుగుదలపై ‘పోరుబాట’ అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు విద్యుత్ వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం పోరుబాట వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, నాయకులు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, నత్తా నాని, అర్జున్ పాల్గొన్నారు.



పామర్రులో వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు

డ్రెయిన్‌లో పూడిక తీత ఎప్పుడు?

పామర్రు: పామర్రు మురుగు డ్రెయిన్‌లో డెక్క, తూడు కాడతో నిండిపోయి ఎన్నో ఏళ్లుగా మురుగు ప్రవహించడం లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్‌లో పెరిగిన చెత్తను తొలగించకపోవడంతో పాటుగా గట్లపై ఎంతో కాలంగా ఉన్న ఆక్రమణలను కూడా తొలగించని కారణంగా డ్రెయిన్ కుచించుకుపోయింది. దీంతో డ్రెయిన్‌లో చేరిన మురుగు నీరు దిగువ ప్రాంతాలకు చేరే అవకాశం లేక ఎక్కడ మురుగు అక్కడే అన్న చందాన ఉంటోంది. డ్రెయిన్ వెంబడి ఉన్న పొలాల్లో ఉన్న అదనపు నీరు సైతం ఈ డ్రెయిన్ ద్వారా దిగువకు ప్రవహించాల్సి ఉంది. కోటిరెడ్డి పేట నుంచి వచ్చే మురుగు ఈ డ్రెయిన్ లోనే కలుస్తుంది. ఈ విషయమై గతంలో స్థానికులు తహసీల్దార్‌కు అర్జీని సమర్పించినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు కాడను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పామర్రు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు కాడ

రోడ్లపైనే మురుగు నీరు



పామర్రు అరండల్‌పేటలో రోడ్డుపైనే నిలిచిన మురుగునీరు

పట్టించుకోని పాలకులు

పామర్రు: పామర్రులో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు రోడ్లపైనే నిలిచిపోతోంది. దీంతో రాక పోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక అరండల్‌పేటలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేని కారణంగా వర్షం నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం లేక రోడ్లపైనే చేరుతోంది. గతంలో రహదారి వేసే సమయంలో లెవెలింగ్ సక్రమంగా చేయని కారణంగా మురుగునీరు నిల్వ చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయినేజీ ప్రవాహం లేక నిలిచిన మురుగు

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు చేశారు.

ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆయుర్వేదిక్ డాక్టర్ ఇబ్రహీం సేవలు అభినందనీయం

మండవల్లి: ఆయుర్వేదిక్ డాక్టర్ ఇబ్రహీం సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. పెరికెగూడెంలో మంగళవారం జయమంగళ పర్యటించిన సందర్భంగా ఆయుర్వేదిక్ డాక్టర్ ఇబ్రహీంను ఆయన కుటుంబ సభ్యులను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పేదలకు ఇబ్రహీం అందిస్తున్న వైద్య సేవలను అభినందించారు.



డాక్టర్ ఇబ్రహీంను అభినందిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

గుడివాడరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం క్రాస్‌రోడ్స్ వద్ద ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్ఐ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాట్లు, ప్రమాద సూచికల బోర్డులను మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు కూడా పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించి ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



మల్లాయపాలెం క్రాస్‌రోడ్స్ వద్ద సీసీ కెమెరాల ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్ఐ చంటిబాబు

ప్రజల సౌకర్యం కోసమే ప్రత్యేక గది

ముదినేపల్లి రూరల్: వివిధ పనుల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యం కోసమే ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించినట్లు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులకు గదిని కేటాయించినట్లు వచ్చిన ఆరోపణలపై మంగళవారం ఆయన స్పందించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అనేక మంది పనుల నిమిత్తం కార్యాలయానికి రావడం సహజమన్నారు. వారు కూర్చునేందుకు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీనిని గమనించి ఆ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఒక గదిని శుభ్రపరచి ప్రజల కోసం కేటాయించినట్లు ఎంపీపీ తెలిపారు.